గొంతెండుతోంది..


నిరుపయోగంగా బోరు మోటారు

- అందని భగీరథ నీరు
- రోజురోజుకు పెరుగుతున్న సమస్య
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

మిరుదొడ్డి(దుబ్బాక): అసలే ఎండాకాలం.. ఎండ తీవ్రత కూడా పెరుగుతోంది. దీంతో నీటి అవసరాలు పెరిగాయి. గ్రామాల్లో వచ్చీ రాని మిషన్ భగీరథ నీటితో ప్రజలు తంటాలు పడుతున్నారు. నీటి సమస్య రోజు రోజుకు తీవ్రమవుతోందని మండల కేంద్రమైన మిరుదొడ్డిలోని ఎస్సీ, ఎస్టీ కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూడునెలలుగా ఎస్టీ కాలనీలో మిషన్ భగీరథ నీటి సరఫరా ఆగిపోవడంతో నానాకష్టాలు పడుతున్నామని అసహనం వ్యక్తం చేస్తున్నారు. గ్రామ పంచాయతీ పాలకవర్గంతో పాటు అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేకుండా పోతోందని మహిళలు వాపోతున్నారు.

- మిరుదొడ్డి మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి అందె రోడ్డు వరకు ఉన్న ఎస్సీ కాలనీలో నీటి సరఫరా అస్తవ్యస్తంగా మారడంతో కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.
- వారంరోజుల పాటు ఉదయం, మరోవారం రాత్రి పూట భగీరథ నీటి సరఫరా చేస్తుండటంతో నానా అవస్థలకు గురవుతున్నామని ఎస్సీకాలనీ వాసులు వాపోతున్నారు.


ఎస్టీ కాలనీలో నీటి సరఫరా లేని మిషన్ భగీరథ పైపులైన్ నల్లా

- గంట పాటు ఇచ్చే నీటి సరఫరాలో అసలు పరిమాణం కంటే తక్కువ నీరు వస్తుండడంతో నాలుగు బిందెలు కూడా నిండని పరిస్థితులు నెలకొన్నాయని మండిపడుతున్నారు.
- ఎత్తు ప్రదేశాల్లో నీరు సరిగా రాకపోవడంతో పాట్లు పడుతున్నామని, చేసేది లేక దూర ప్రాంతాలకు వెళ్లి తెచ్చుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- నెలరోజుల నుంచి నీటి సరఫరాలో అంతరాయం కలుగుతుందని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని మండిపడుతున్నారు.
- కాగా కాలనీలో నీటి అవసరాలు తీర్చాల్సిన బోరు మోటారుతో పాటు స్టార్టర్ కాలిపోయి సుమారు రెండు నెలలు గడుస్తున్నా పట్టించుకునే వారే లేరని వాపోయారు.
- ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో నెలకొన్న నీటి సమస్యకు పరిష్కారం చూపాలని ఆయా కాలనీ వాసులు డిమాండ్ చేస్తున్నారు. లేదంటే రోడ్డెక్కి ఆందోళనకు దిగుతామని హెచ్చరిస్తున్నారు.


సన్నని దారలా పోస్తున్న నీరు

మూడు నెలలుగా వస్తలేవు



మూడు నెలలుగా మిషన్ భగీరథ నీరు వస్తలేవు. అసలే ఎండా కాలం కావడంతో నీళ్లకు చాలా ఇబ్బంది అవుతోంది. నీటి కోసం పక్క కాలనీకు వెళ్తే అక్కడి మహిళలు గొడవ పెడుతున్నారు. నీళ్లు వస్తలేవని పెద్దసార్లకు చెప్పినా పట్టించుకోవడం లేతు. మా సమస్యకు పరిష్కారం చూపాలి.
– పద్మ, ఎస్టీ కాలనీ, మిరుదొడ్డి

ఇబ్బంది పడుతున్నాం



నెల పదిహేను రోజుల నుంచి నీళ్లు సరిగా రావడం లేదు. నీళ్లు వచ్చేవి గంట సేపయితే అందులో సన్న దారగా వస్తున్నాయి. దీంతో నాలుగు బిందెలు కూడా నిండడం కష్టంగా ఉంది. మా కాలనీల గ్రామ పంచాయతీ బోరు కూడా పాడైంది. అది బాగు చేసే టోళ్లు లేరు. అటు బోరు మోటారు పాడై, నల్లాలు సరిగా రాక పోయేసరికి దూర ప్రాంతాలకు వెళ్లి నీళ్లు తెచ్చుకుంటున్నాం. జెర పెద్ద సార్లు కలుగజేసుకొని నీళ్లు వచ్చేటట్టు చేయాలి.
– కవిత, ఎస్సీ కాలనీ, మిరుదొడ్డి

పరిష్కారం చూపుతాం



రెండు కాలనీల్లో నెలకొన్న నీటి సమస్యకు పరిష్కారం చూపుతాం. ఈ సమస్యపై గ్రామ పంచాయతీ కార్యదర్శితో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలిస్తాం. మిషన్ భగీరథ నీటి సరఫరాలో జరుగుతున్న ఆటంకాన్ని నివారించడానికి చర్యలు చేపడతాం. వేసవిని దృష్టిలో పెట్టుకొని నీటి ఎద్దడి తలెత్తకుండా ఉండేందుకు బోరు మోటారును బాగు చేయించేలా సత్వర చర్యలు తీసుకుంటాం.
– రాజిరెడ్డి, ఎంపీడీఓ, మిరుదొడ్డి

మహిళా సాధికారతకు విశేష కృషి


మాట్లాడుతున్న ఉషా బాజ్‌పాయ్

హుస్నాబాద్: దేశ చరిత్రలో కనివిని ఎరుగని రీతిలో మహిళా సాధికారతకు ప్రధాని మోదీ విశేషంగా కృషి చేస్తున్నారని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు ఉషా బాజ్‌పాయ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఆర్యవైశ్య భవన్‌లో తెలంగాణ ప్రవాస్ యోజన కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సశక్తికరణ్ అభియాన్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆమె హాజరయ్యారు. ఉషా బాజ్‌పాయ్ పట్టణంలోని ఎల్లమ్మ ఆలయాన్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దేశంలో మహిళలకు పెద్దపీట వేస్తూ కేంద్ర కేబినేట్‌లో 11 మంది మహిళలకు అవకాశం ఇచ్చి, మహిళలే ఈ ప్రపంచానికి సారథులని మోదీ ప్రభుత్వం నిరూపించిందన్నారు. బూత్ సశక్తికరణ్ అభియాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేసి బూత్ లెవల్‌లో పార్టీని పటిష్టపరచాలని ఆమె పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాంగోపాల్‌రెడ్డి, నియోజకవర్గ నాయకులు శ్రీరాంచక్రవర్తి, సురేందర్‌రెడ్డి, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు అరుణారెడ్డి, ప్రధాన కార్యదర్శి స్వరూప, జిల్లా కోశాధికారి శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు శంకర్ పాల్గొన్నారు.

‘సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం’


మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

కొండపాక(గజ్వేల్): సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని ఆత్మీయ సమ్మేళనాల నిర్వహణ జిల్లా ఇన్‌చార్జి, బీఆర్‌ఎస్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ బోడకంటి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మండల పరిధిలోని దుద్దెడలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో మండల అధ్యక్షుడు కుమార్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళన సమావేశం ఆదివారం నిర్వహించారు. ఉద్యమ కాలం నుంచి జెండాలు మోశాం. పార్టీ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాం. ఏమైనా సమస్యలు ఏర్పడితే తీర్చే వారులేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో గుర్తుకు వస్తున్నామా అంటూ కిందిస్థాయి నాయకులు నిర్మోహమాటంగా అసంతృప్తిని వెలిబుచ్చుతూ కొందరు సమావేశం నుంచి బయటకు వెళ్లిపోయారు. పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధుల్లో నెలకొన్న విభేదాలు మూలంగా కిందిస్థాయి నాయకులం ఎవరి వద్దకు వెళ్లాలో తెలియక సతమతున్నామంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్య పెద్దది కాకుండా ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి సముదాయించి బయటకు వెళ్లిన వారిని తీసుకొచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు ప్రజలకు వివరించేలా చూసుకోవాలన్నారు. కార్యకర్తల బాధలను సీఎం కేసీఆర్ పెద్దమనస్సుతో ఆలోచించి తగు న్యాయం చేస్తారన్న నమ్మకం పెట్టుకుంటూ ప్రతిపక్షాలకు అవకాశం దక్కకుండా చూసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, ఎంపీపీ సుగుణ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ లక్కిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రైతుబంధు రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దేవి రవీందర్, ఎన్‌ఆర్‌ఈజీఎస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు సద్గుణ, మాజీ హౌజింగ్ కార్పొరేషన్ చైర్మన్ భూంరెడ్డి, జాగృతి గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ప్రశాంత్, సర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షుడు మహాదేవ్‌గౌడ్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ అమరేందర్, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు సాయిబాబ, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

సిరిసినగండ్ల సిరిమల్లెలు పుస్తకావిష్కరణ


మహేంద్రారెడ్డిని సన్మానిస్తున్న బాలసాహితీవేత్తలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఎలాంటి కల్మషం లేని బాలల వికాసానికి బాలసాహిత్య పుస్తకాల ప్రచురణ జరగాలని రంగనాయక రచయితల సంఘం అధ్యక్షుడు పిస్నంటి మహేంద్రారెడ్డి అన్నారు. అంతర్జాతీయ బాలల పుస్తక దినోత్సవం సందర్భంగా ఆదివారం సిద్దిపేటలో జరిగిన సమావేశంలో పిస్నంటి మహేంద్రారెడ్డి సంపాదకీయంలో వెలువడిన సిరిసినగండ్ల సిరిమల్లెలు బాలసాహిత్య పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మహేంద్రారెడ్డి మాట్లాడుతూ.. బాలల వికాసానికి కృషి చేస్తే సమాజ శ్రేయస్సుకు పాటుపడిన వారమవుతామన్నారు. ఈ సందర్భంగా బాలల కోసం పుస్తకం ప్రచురించిన మహేంద్రారెడ్డిని బాలసాహిత్య రచయితలు సన్మానించారు. కార్యక్రమంలో బాలసాహితీవేత్తలు ఉండ్రాళ్ల రాజేశం, పెందోట వెంకటేశ్వర్లు, బస్వరాజ్ కుమార్, కోణం పరశురాములు, శ్రీచరణ్ సాయి దాస్, అనిశెట్టి సతీశ్‌కుమార్, రాజేశం పాల్గొన్నారు.

స్వాగతసభ కరపత్రాల ఆవిష్కరణ


స్వాగతసభ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి

గజ్వేల్‌రూరల్: హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో ఈనెల 4న జరగనున్న స్వాగత సభకు సంబంధించిన కరపత్రాలను ఆదివారం గజ్వేల్ పట్టణంలో ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, గజ్వేల్ ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్‌లు వేర్వేరుగా ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ.. 125 అడుగుల డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహ ప్రారంభోత్సవం, నూతన సచివాలయానికి డాక్టర్ అంబేడ్కర్ పేరు పెట్టడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో ఆయా సంఘాల నాయకులు బైరం శివకుమార్, చిప్పల యాదగిరి, ఏగొండస్వామి పాల్గొన్నారు.

కరాటే విద్యార్థులకు సన్మానం


విద్యార్థులను సన్మానిస్తున్న సరస్వతీ మిత్ర బృందం సభ్యులు

దుబ్బాక: గోవా ఏషియన్ ఇంటర్నేషనల్ కరాటే ఛాంపియన్‌లో సత్తా చాటిన దుబ్బాక విద్యార్థులను సరస్వతీ మిత్ర బృందం ఆదివారం దుబ్బాకలో ఘనంగా సన్మానించి సత్కరించారు. గోవాలో గత నెల మార్చి 29, 30న గోవాలో నిర్వహించిన ఏషియన్ అంతర్జాతీయ స్థాయి కరాటే పోటీల్లో ఆర్ట్ ఆఫ్ డిఫెన్స్ అకాడమీలో మనస్విని, అక్షయ, వర్షిణిలు నాలుగు గోల్డ్ మెడల్స్, రెండు సిల్వర్ మెడల్స్ సాధించారు. కార్యక్రమంలో పల్లె వంశీ కృష్ణగౌడ్, నరేందర్, మోహన్, రాజేందర్, గోపి, సంతోష్‌రెడ్డి, నరేష్, సంతోష్, బాలేశం, వంశీచారి, శ్రీనివాస్‌రెడ్డి, సత్యనారాయణ పాల్గొన్నారు.

కార్మికుల కుటుంబాలకు అండ


చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తిరెడ్డి

చేర్యాల(సిద్దిపేట): కార్మికుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. మండల పరిధిలోని నాగపురికి చెందిన హమాలీ కార్మికుడు మజ్జిగ బీరయ్య ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందగా ప్రభుత్వ లేబర్ బోర్డు, తెలంగాణ కార్మిక విభాగం నుంచి బీరయ్య కుటుంబానికి వచ్చిన బీమా సొమ్ము రూ.6.30లక్షలు, చుంచనకోట గ్రామానికి చెందిన కర్రే స్వామి కుటుంబసభ్యులకు రూ.1.30లక్షలు, మద్దూరు మండలం రేబర్తి గ్రామానికి చెందిన పల్లపు యాదయ్య కుటుంబసభ్యులకు రూ.1.30లక్షల చెక్కులను ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉల్లంపల్లి కరుణాకర్, వైస్ ఎంపీపీ తాండ్ర నవీన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ కార్మిక విభాగం జిల్లా కార్యదర్శి ముస్త్యాల గణేశ్, కార్మిక విభాగం మండల అధ్యక్షుడు కంతుల రాజు, మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు సుభాని, నాయకులు స్వామి, కొండల్ తదితరులు పాల్గొన్నారు.

దొడ్డి కొమురయ్య జయంతిని ఘనంగా నిర్వహిద్దాం

కురుమ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాములు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య జయంతిని జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహిద్దామని, అందుకు కురుమలు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కురుమ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కొలుపుల రాములు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దొడ్డి కొమురయ్య జయంతిని అధికారకంగా నిర్వహించేందుకు గాను రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై హర్షిస్తున్నట్లు తెలిపారు. అందుకు గాను ప్రత్యేక జీవోను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయడంలో ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావు, ఐటీశాఖ మంత్రి కేటీఆర్‌ల కృషి మరువలేనిదని వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు.

12శాతం రిజర్వేషన్ అమలు చేయాలి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): గత ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం కేసీఆర్ ముస్లింలకు ఇచ్చిన 12 శాతం రిజర్వేషన్ హామీని నిలబెట్టుకోవాలని కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్, మైనార్టీ విభాగం సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు మజార్‌మాలిక్, సిద్దిపేట నియోజకవర్గ యూత్ విభాగం అధ్యక్షుడు వాహబ్‌లు అన్నారు. సిద్దిపేటలో ఆదివారం వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల నేపథ్యంలో ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్ ఇస్తామని హామీ ఇచ్చిందని, ఈ హామీని ఇప్పటివరకు నెరవేర్చలేదన్నారు. ఇఫ్తార్ విందుకు బదులుగా 12శాతం రిజర్వేషన్ అమలు చేయాలన్నారు. ముస్లింల అభివృద్ధికి పాటు పడాల్సిన తంజీమ్ నాయకులు విధులు మర్చిపోయారన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చిన నిధులపై తంజీమ్ శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మైనార్టీ సిద్దిపేట పట్టణ ఉపాధ్యక్షుడు ఫయాజ్, యూత్ కాంగ్రెస్ జిల్లా నాయకుడు సలీం, యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గయాజుద్దీన్, ఎన్‌ఎస్‌యూఐ వర్కింగ్ ప్రెసిడెంట్స్ అజ్మత్, రషీద్ తదితరులు పాల్గొన్నారు.

అశ్వవాహనంపై లక్ష్మీనర్సింహుడి ఊరేగింపు


స్వామివారి ఊరేగింపు


గరుడ వాహనంపై ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి లక్ష్మీనర్సింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారి ఉత్సవమూర్తులను గ్రామ పుర వీధుల గుండా అశ్వవాహనంపై ఊరేగించారు. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. ఆలయ పూజారి మధుసూదనాచారి, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా సీతారాముల ఉత్సవ విగ్రహాల ఊరేగింపు

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండల కేంద్రంలో సీతారామచంద్ర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం సీతారామ చంద్రస్వామి ఉత్సవ మూర్తులను గరుడ వాహనంపై ఊరేగించారు. శనివారం రాత్రి బ్రాహ్మణులు మంత్రోచ్చారణలతో వైభవంగా సీతారాముల కల్యాణం నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు, కోలాటాలతో ఊరేగింపు కనుల పండువగా సాగింది. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. భక్తులు కానుకలను సమర్పించుకున్నారు.

పాపన్న స్ఫూర్తితో ఉద్యమించాలి


చేర్యాల(సిద్దిపేట): నివాళులర్పిస్తున్న గౌడ సంఘం ప్రతినిధులు


హుస్నాబాద్: నివాళులర్పిస్తున్న గౌడ సంఘ నాయకులు

చేర్యాల(సిద్దిపేట): సర్దార్ సర్వాయి పాపన్న స్ఫూర్తితో బహుజనుల రాజ్యాధికారానికి ఉద్యమించడమే పాపన్నకు నిజమైన నివాళి అని కల్లు గీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బండకింది అరుణ్ అన్నారు. ఆదివారం సర్దార్ సర్వాయి పాపన్న 313వ వర్ధంతిని పురస్కరించుకొని కల్లు గీత కార్మిక సంఘం చేర్యాల పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక కార్యాలయంలో పాపన్న చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు అనగోని నర్సింహులుగౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు పోతుగంటి లింగంగౌడ్, కేజీకేఎస్ సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ మేరిండ్ల శ్రీనివాస్‌గౌడ్, సంఘం ప్రతినిధులు రాజు, ప్రసాద్, కృష్ణమూర్తి, రమేశ్, శ్రీనివాస్, నరేశ్, రాజయ్య, మురళి తదితరులు పాల్గొన్నారు.

హుస్నాబాద్‌రూరల్: గీత కార్మికుల హక్కుల సాధనకు ప్రతి ఒక్కరూ ఉద్యమించాలని గౌడ జన హక్కుల సమితి జిల్లా కార్యదర్శి మార్క అనిల్‌కుమార్ అన్నారు. ఆదివారం మహ్మదాపూర్ కొమ్ము గుట్టపై ఏర్పాటు చేసిన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గీత కార్మిక సంఘం నాయకులు ముంజ కుమార్, జాగిరి దేవేందర్, మాజీ సర్పంచ్ బొంగొని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హుస్నాబాద్: పట్టణంలో నివాళులర్పించిన వారిలో మండల కల్లు గీత కార్మిక సంఘం అధ్యక్షుడు రవీందర్‌గౌడ్, నాయకులు కొమురయ్య, రవీందర్‌గౌడ్, వెంకన్న, చంద్రమౌళి, రామస్వామి, బాలయ్య, ప్రకాశ్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

వర్గల్(గజ్వేల్): మండలంలోని వేలూరులో చిత్రపటానికి నివాళులర్పించిన వారిలో సర్పంచ్ పాపిరెడ్డి, ఉపసర్పంచ్ మధుయాదవ్, గౌడ సంఘ నాయకులు వెంకటేశ్వర్‌గౌడ్, ప్రవీణ్‌గౌడ్, నర్సింహగౌడ్, స్వామిగౌడ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

కంటి వెలుగు శిబిరం పరిశీలన


శిబిరాన్ని పరిశీలిస్తున్న వైద్యాధికారి కాశీనాథ్

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండలంలోని లకుడారం గ్రామంలో కొనసాగుతున్న కంటి వెలుగు శిబిరానికి ఈనెల 4వ తేదీన రాష్ట్ర సీఎస్ శాంతికుమారి, రాష్ట్ర హెల్త్ అండ్ కమిషనర్ స్వేత హాజరవుతున్నందున ఆదివారం జిల్లా వైద్యాధికారి కాశీనాథ్ పరిశీలించారు. శిబిరంలో వసతులు, నిర్వహణ తీరులను పరిశీలిస్తూ వైద్య సిబ్బందికి తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కనకవ్వ, కంటి వెలుగు క్వాలిటీ కంట్రోలింగ్ ఆఫీసర్ రాకేశ్, కుకునూరుపల్లి ఆస్పత్రి వైద్యులు బల్‌బీర్‌సింగ్, నాయకులు ఐలయ్య, ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

విద్యార్థుల సౌకర్యార్థం ఆర్టీసీ సేవలు

సిద్దిపేటకమాన్: పది పరీక్షలు రాయనున్న విద్యార్థుల సౌకర్యార్థం ఆర్టీసీ బస్సులు నడపనున్నట్లు సిద్దిపేట డిపో మేనేజర్ సుఖేందర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నేటి నుంచి పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులు రాయితీ బస్ పాస్‌తో పాటు పదో తరగతి హాల్‌టికెట్‌ను చూపించి ఆర్టీసీ బస్సుల్లో బస్ పాస్ రూట్ కాకపోయినా ఇతర రూట్‌లలో కూడా ఉచితంగా ప్రయాణించొచ్చని పేర్కొన్నారు. ఆర్టీసీ సేవలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

హాల్‌టికెట్ చూపిస్తే ఉచిత బస్ ప్రయాణం

హుస్నాబాద్: నేటి నుంచి పది పరీక్షలు ప్రారంభ దృష్ట్యా విద్యార్థులకు ఆర్టీసీ బంపర్ ఆఫర్ ఇచ్చింది. హుస్నాబాద్ పట్టణంలోని బస్టాండ్‌లో ఆదివారం కండక్టర్లు, డ్రైవర్లకు డిపో మేనేజర్ వెంకటేశ్వర్లు మజ్జిగ ప్యాకెట్లు ఇస్తూ విద్యార్థులపై అనుసరించాల్సిన విషయాలపై ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థులకు బస్‌పాస్ ఉన్న, హాల్ టికెట్ చూపించిన వారిని సమయానికి పరీక్షా కేంద్రాల వరకు ఉచితంగా తీసుకుపోవాలని ఆదేశించారు.

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ


భూమిపూజ చేస్తున్న ప్రజాప్రతినిధులు

మద్దూరు(హుస్నాబాద్): మండల పరిధిలోని వల్లంపట్ల గ్రామంలో అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు సర్పంచ్ ఆలేటి రజితయాదగిరి ఆధ్వర్యంలో ఆదివారం భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గూళ్ల సత్యకళ ఆనందం, ఉపసర్పంచ్ కర్నే మనోహర్, వార్డు సభ్యులు వేల్పుల యాదగిరి, నారదాసు రాజు, కొమురవెల్లి దేవస్థానం డైరెక్టర్ చిట్కూరు తిరుపతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు పురస్కారాలు


పురస్కారం అందుకుంటున్న డాక్టర్ రాజేశ్వర్‌రెడ్డి

సిద్దిపేటకమాన్: సిద్దిపేటకు చెందిన జ్యోతిష్యుడు డాక్టర్ కలకుంట్ల రాజేశ్వర్‌రెడ్డికి అరుదైన పురస్కారం లభించింది. జ్యోతిష్య, సాహితీ రంగంలో ఆయన సేవలను గుర్తించిన తెలుగు సాహిత్య సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన శ్రీత్యాగరాయ గాన సభలో మహానంది జాతీయ ఉగాది పురస్కారాన్ని అందించారు.

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని రసులాబాద్ సర్పంచ్ పచ్చిమడ్ల స్వామిగౌడ్‌కు తెలుగు వెలుగు ఉగాది మహానంది జాతీయ అవార్డు లభించింది. ఆదివారం హైదరాబాద్ శ్రీత్యాగరాయ గానసభ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో అవార్డును అందుకున్నారు.

ఢిల్లీకి తరలిన ప్రజాసంఘాల నాయకులు

చేర్యాల(సిద్దిపేట): ఈ నెల 5వ తేదీన ఢిల్లీలో జరిగే కార్మిక కర్షక సంఘర్షణ ర్యాలీలో పాల్గొనేందుకు మండల కేంద్రం నుంచి పలువురు ప్రజా సంఘాల నాయకులు ఆదివారం తరలి వెళ్లారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కొంగరి వెంకట్‌మావో మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ అనుసరిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలపై చేసే పోరాటంలో భాగమే ఈ సంఘర్షణ ర్యాలీ అని, ర్యాలీని విజయవంతం చేసేందుకు మండల కేంద్రం నుంచి తరలివెళ్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం, ప్రజాసంఘాల నాయకులు శ్రీనివాస్, మల్కని ఎల్లయ్య, బోయిని మల్లేశం, రెపాక కుమార్, గుండ్ర రవీందర్, సత్తాల మహేశ్, శ్రీనివాస్ తదితరులున్నారు.